చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయలేదని పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న బోయిన ఎల్లేశ్ మాదిగ

మలక్‌పేట: చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఎమ్మార్పీఎస్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేశ్ మాదిగ ఆధ్వర్యంలో మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 70 లక్షల మంది మాదిగలు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగలను మోసం చేసిందన్నారు. ప్రత్యేక మాదిగ కార్పొరేషన్ కోసం సీఎంకు వినతి పత్రం ఇచ్చినా.. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాదిగలు అన్ని విధాలా నష్టపోయారని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, దామోదర్ రాజనర్సింహపై కేసు నమోదు చేయాలని కోరుతూ మలక్‌పేట ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు దర్శనం రామస్వామిమాదిగ, ఇంద్రకంటి సూరిమాదిగ, బాబురావు మాదిగ, జంబూల అరుణ బైండ్ల తదితరులు ఉన్నారు. న్యాయ సలహా తీసుకుని ఫిర్యాదును పరిశీలిస్తామని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ తెలిపారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి సీఎంను శుక్రవారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫార్మా, స్కిల్ యూనివర్సిటీ, హెల్త్–ఎడ్యుకేషన్ హబ్స్, ఇండస్ట్రియల్ పార్క్స్, మెట్రో రైలు విషయాలపై చర్చించినట్లు వారు పేర్కొన్నారు. ఫోర్త్ సిటీతో పాటు మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దే అంశాలు, స్కిల్ యూనివర్సిటీ సహా ఫోర్త్ సిటీ పనులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

హయత్‌నగర్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొన్న బండ్లగూడ సమీపంలోని ఇందు ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థిని ప్రహాసిని సూర్యతేజ సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ప్రహాసినిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీ అరుణరెడ్డి, ప్రిన్సిపాల్ మోహన్ ప్రకాశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకళ, కోచ్ ప్రవీణ్, పేరెంట్స్ తేజోరమ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎల్‌బీనగర్: పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బూత్ అధ్యక్షుల సమావేశాన్ని సచివాలయనగర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడేవారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిశోర్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి నీళ్ల అంజన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన



మేళాలో వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వనస్థలిపురం: హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు అనూహ్య స్పందన వస్తోంది. ప్రజలు దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోళ్లు చేస్తున్నారు. మేళాలో పేరొందిన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్‌స్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, బ్యాగులు ఇతర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. జనవరి 12 వరకు మేళా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: ఫైర్ సేఫ్టీ పరికరాలు లేని భవనం యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇజ్జగిరి కమలాకర్, గోరికర్ అనిల్ ఎల్‌బీనగర్ ఫైర్ స్టేషన్ అధికారి శ్రీధర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైతన్యపురి వద్దనున్న అర్చన కాంప్లెక్స్‌లో పలు ఇనిస్టిట్యూట్స్, షాపులు ఉన్నాయన్నారు. అందులో చాలామంది విద్యార్థులు నివసిస్తున్నారని, వెంటిలేషన్ సరిగా లేదని ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే కనీసం బయటకు కూడా వచ్చే పరిస్థితులు లేవన్నారు. విద్యార్థుల రాజకీయ పార్టీ స్టేట్ కమిటీ సభ్యుడు అనిల్ కుమార్ నందాల తదితరులు పాల్గొన్నారు.



ఫైర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆండాళ్ నిలయంలో పూజలు



సౌభాగ్యవతులకు కుంకుమ, పసుపు, గాజులు అందజేస్తున్న నిర్వాహకురాలు రూపాదేవి

మలక్‌పేట: మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 'ఉందుమదగళిత్త' పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు, అర్చనలు చేశారు. ప్రవచనకర్త ఉ.వే. చించాపట్టణం జగన్మోహనాచార్య స్వామి గోవింద నామస్మరణ, సహస్రనామ స్మరణ ప్రత్యేక పూజలు చేసి ప్రవచన అనుగ్రహం చేశారు. అనంతరం ఆండాళ్ నిలయం నిర్వాహకులు భగవత్ దాసురాలు లక్ష్మీదేవి, రూపాదేవి సౌభాగ్యవతులైన భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు తాంబూల వితరణ గావించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, ఎస్ఐ సంజీవరెడ్డి, పీఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో భక్తులు

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీ తిప్పర్తి యాదయ్య



మన్సూరాబాద్‌లో ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి..

చిత్రపటాలకు పూలమాలలు, సేవల స్మరణ

దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, విద్యావేత్త, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఎల్‌బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సావిత్రిబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



అల్కాపురిలో కాంగ్రెస్ నాయకులు..



ఐఎస్‌సదన్‌లో కోట్ల శ్రీనివాస్..



నాగోలు సాయినగర్ కాలనీలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ అరుణ



చంపాపేట్ ప్రభుత్వ పాఠశాలలో సన్మానం..



నివాళులర్పిస్తున్న బట్టుదాసురావు మాదిగ

డ్రైనేజీ పొంగకుండా చర్యలు తీసుకోవాలి

నాగోలు: కాలనీల్లో డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ బాలాజీనగర్ కాలనీలో పాత డ్రైనేజీ లైన్ పాడై మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం కాలనీలో పర్యటించి డ్రైనేజీని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వెంటనే నూతన డ్రైనేజ్ లైన్ పనులు ప్రారంభించాలని జలమండలి ఏఈ ప్రవంతి రెడ్డిని కోరారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు ఆరీఫ్, దయాకర్, కాలనీ సెక్రెటరీ స్వామి, నాయకులు మంచి రాజేశ్, యాదయ్య, గణేశ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

పాత కమిటీనే కొనసాగించాలి

నాగోలు: శ్రీ సాయినగర్‌కాలనీ ఓనర్స్ అసోసియేషన్ పాత కమిటీనే కొనసాగించాలని ఆ ఓనర్స్ అసోసియేషన్ బాడీ జనరల్ సెక్రటరీ బి. యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు ఇతర సభ్యులు పేర్కొన్నారు. నాగోలులోని శ్రీసాయినగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత నెల 29న కాలనీ ఎన్నికలు నిర్వహించామన్నారు. అయితే కాలనీలో మరో ప్యానల్ సభ్యులు కోర్టును వెళ్లగా ఫలితాలు ప్రకటించవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడంతో ఓట్లు లెక్కించలేదన్నారు. పోలింగ్‌కు ముందు తమను వ్యతిరేకిస్తున్న వర్గం ఏకగ్రీవంగా తాము ఎన్నికయ్యామని కార్యవర్గాన్ని ప్రకటించుకుని కమ్యూనిటీ భవనంలో బ్యానర్ పెట్టారని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు వరకు పాత కమిటీనే కొనసాగించాలని వారు కోరారు. కాలనీలో వర్గ విభేదాలను వీడి కాలనీ సంక్షేమం, అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, సూర్య ప్రకాశ్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ బాడీ జనరల్ సెక్రటరీ యుగంధర్‌రెడ్డి, సభ్యులు

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

సైదాబాద్: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. బీబ్లాక్ క్వార్టర్స్‌లోని అంధ బాలికల పాఠశాల, వసతి గృహంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో బాలికల హాస్టల్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్రెయిలీ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొననున్నట్లు తెలిపారు. బాలికలకు మంచి ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

జీహెచ్‌ఎంసీలో కుంటుపడిన అభివృద్ధి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్లలో పర్యటన

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో కార్పొరేటర్లతో కలిసి శుక్రవారం పర్యటించి జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వారు ముందుకు రావడం లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. నగర మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ ఫిరాయించడంతో కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదని, కాంగ్రెస్ కార్పొరేటర్లు లేకపోవడంతో డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. తమ డివిజన్ల అభివృద్ధికి కార్పొరేటర్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం

హయత్‌నగర్ పరిధిలోని కొలను శివారెడ్డినగర్, పలు కాలనీల్లో డ్రైనేజీని మదర్ డెయిరీ ప్రాంగణంలో ఉన్న ట్రంక్‌లైన్‌లో కలపాల్సి ఉండగా మదర్‌డెయిరీ అధికారులు అభ్యంతరం తెలపడంతో నిలిచిపోయింది. ఈ విషయాన్ని కార్పొరేటర్లు ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో మదర్‌డెయిరీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎండీ కృష్ణతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అదేవిధంగా సీఎస్ఆర్‌కాలనీ నుంచి బాలాజీనగర్‌కాలనీ వరకు ట్రంక్‌లైన్ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో జలమండలి, సివరేజీ బోర్డు జీఎం శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి 24 గంటల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



కొలను శివారెడ్డినగర్‌కాలనీలో ట్రంక్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

పిల్లర్లతో ఫ్లైఓవర్లు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పనామా వద్ద హయత్‌నగర్ వద్ద అండర్‌పాసులకు బదులుగా పిల్లర్లతో ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదించామని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎంపీ తెలిపారు. మన్సూరాబాద్ నుంచి పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్నామని, త్వరలోనే పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మలక్‌పేటకు మంత్రి సీతక్క రాక

చాదర్‌ఘాట్: మలక్‌పేటలో శనివారం (నేడు) నిర్వహించనున్న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలకు రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్గొండ చౌరస్తాలోని బ్రెయిలీ పార్కులో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అంధులకు ఉపకరణాల అందజేత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వనస్థలిపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 5న 'సాక్షి' ఆధ్వర్యంలో, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో (నాగార్జున పాఠశాల ఎదురుగా) ఉదయం 9.30 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు మరికొందరికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు మెటీరియల్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9705347239, 9705347248 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రెజ్లింగ్‌లో ప్రతిభ



సంకీర్తన్ యాదవ్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

చైతన్యపురి: ఇటీవల జరిగిన సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్ షిప్‌లో చైతన్యపురికి చెందిన తోట సంకీర్తన్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించాడు. చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్ కుమారుడైన సంకీర్తన్ యాదవ్ శుక్రవారం కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంకీర్తన్ యాదవ్‌ను అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శబరిమల సమీపంలో రోడ్డు ప్రమాదం

- అదనపు డ్రైవర్ మృతి
- 22 మంది అయ్యప్పస్వాములు క్షేమం



రాజు (ఫైల్)

సైదాబాద్: పాతబస్తీ నుండి శబరిమలకు వెళ్లిన ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బస్సు అదనపు డ్రైవర్ మృతి చెందాడు. బస్సులో ఉన్న అయ్యప్ప భక్తులు స్వల్పగాయాలతో క్షేమంగా బయటపడ్డారు. సైదాబాద్, మాదన్నపేట, ఉప్పరిగూడకు చెందిన 22 మంది అయ్యప్ప భక్తులు గతనెల 26న బస్సులో శబరిమలకు బయలుదేరారు. జనవరి 1 తెల్లవారుజామున పంబకు 15 కిలోమీటర్ల దూరంలో అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. డ్రైవింగ్ క్యాబిన్‌లో నిద్ర పోతున్న అదనపు డ్రైవర్ రాజు బయటకు ఎగిరిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు కుటుంబంతో కలిసి సైదాబాద్ ఏకలవ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా ప్రమాదం గురించి తెలుసుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ వెంటనే కొట్టాయం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తమకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ చూపించారని ప్రమాదానికి గురైన భక్తులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

మలక్‌పేట: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై తేజ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ డివిజన్ అస్మాన్‌ఘడ్ హమాలీబస్తీకి చెందిన మస్త్యాల పోచయ్య (63) గత నెల 29న సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. గతంలోనూ ఇలాగే తప్పిపోగా దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ సమీపంలో ఉండగా గుర్తించి ఇంటికి తీసుకుచ్చారు. ఈసారి ఎక్కడ కూడా కన్పించలేదని వృద్ధుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో యాదవులను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న నాయకులు

నాగోలు: త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో యాదవులను గెలిపించుకుందామని అఖిల భారత యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. నాగోలులోని శుభం కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత యాదవ మహా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంఘం కేలండర్, డైరీని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు బాబురావు యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో యాదవులు పెద్ద సంఖ్యలో ఉన్నారని అందరం కలిసి ఉంటేనే యాదవ రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం యాదవ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. యాదవ మహిళల చదువుకు తనవంతూ సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్ యాదవ్, యాదవ సంఘం గౌరవ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, చింతల రవీందర్ యాదవ్, నాగోల్ యాదవ సంఘం అధ్యక్షుడు చింతల కిరణ్‌కుమార్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ యాదవ్ వివిధ జిల్లాల యాదవ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.